తుర్క చెరువు పరిరక్షణకు చర్యలు



చెరువు సర్వే చేయిస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

నిజాంపేట్: నిజాంపేట్‌లోని తుర్క చెరువు పరిరక్షణకు ఇరిగేషన్, రెవెన్యూశాఖల అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల చెరువును కబ్జా చేసేందుకు కొందరు వ్యక్తులు యత్నించగా అధికారులకు ఫిర్యాదులు అందాయి. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం శనివారం అధికారులు చెరువు సర్వే నిర్వహించారు. చుట్టూ హద్దులు నిర్ణయించి పోల్స్‌ను నాటారు. ఎవరైనా చెరువు భూమిలో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అభినందన



ముజీబ్ హుస్సేన్‌ను అభినందిస్తున్న ఆస్కాని మారుతిసాగర్

కుత్బుల్లాపూర్: తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీఓ) కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ముజీబ్ హుస్సేన్‌ని శనివారం టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతిసాగర్ కలిసి అభినందించారు. కేంద్ర కమిటీ అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. తెలంగాణ ఉద్యమ సహచరులు ఉన్నత పదవిని చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. టీజీఓ హైదరాబాద్ అధ్యక్షుడు కృష్ణయాదవ్ తదితరులున్నారు.

అనాథలకు 'ఏఎస్ఎఫ్' విందు

మాదాపూర్: మాదాపూర్‌లోని ఇ గలేరియా మాల్‌లోని ఏఎస్ఎఫ్ బార్బెక్యూ గ్రిల్ రెస్టారెంట్ తొలి వార్షికోత్సవంను పురస్కరించుకుని నగరంలోని అనాథ శరణాలయాల విద్యార్థులు, వృద్ధాశ్రమాలలోని వృద్ధులకు విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు సినీనటుడు బెనర్జీ పాల్గొని నిర్వాహకులను అభినందించారు.

విరివిగా మొక్కలు నాటాలి

రాయదుర్గం: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో విరివిగా మొక్కలు నాటాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు.శనివారం గచ్చిబౌలి డివిజన్‌లోని సాయివైభవ్ కాలనీలో హరిత వైభవోత్సవం కార్యక్రమాన్ని ఆయన మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజలు చేసి కాలనీవాసులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ఆరంభమైనందున అన్ని చోట్లా మొక్కలు నాటేందుకు అందుకు అందరూ స్వచ్ఛందంగా ముందుకురావాలన్నారు. కాలనీలోని ఖాళీ స్థలాలు, రోడ్ల పక్కన, ఇళ్లలో మొక్కలు నాటి వాటిని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఎక్కడ పచ్చదనం ఉంటుందో అక్కడ ఆహ్లాదం ఉంటుందన్నారు.అనంతరం కాలనీ అధ్యక్షురాలు పద్మావతి ఆధ్వర్యంలో పలు చోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గణేష్‌ముదిరాజ్, రమేష్, శ్రీనివాస్, నారాయణ, కాలనీవాసులు సుజిత్‌కృష్ణ, సరస్వతి, సిద్ధార్థ, నవీన్, పవన్, రాజు, సత్యనారాయణ, శర్మ, వేణు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా...

బంజారాహిల్స్: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమైన దృష్ట్యా జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో ఒకరినొకరు పలకరించుకున్నారు. యాజమాన్యం, ఉపాధ్యాయులు సంతోషకరమైన వాతావరణాన్ని సృష్టించారు. పాఠశాల ఆవరణను స్ఫూర్తిదాయకమైన, ఆలోచింపజేసే శీర్షికలతో రూపొందించిన చార్టులు, పోస్టర్లను ఏర్పాటు చేశారు. చిన్న చిన్న స్కిట్స్, కథలు, సంగీతం, ఉపాధ్యాయుల నృత్య ప్రదర్శనలు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కాంచనవల్లి మాట్లాడుతూ... అందుబాటులో ఉన్న వివిధ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. హెచ్ఎం విధుమోహన్ మాట్లాడుతూ... నూతనోత్సాహం, ఉల్లాసంతో కొత్త విద్యా సంవత్సరం గడవాలని ఆకాంక్షించారు. విద్యా సంబంధమైన నైపుణ్యం కలిగి సమర్థతతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.

రక్తదానం.. ప్రాణదానం

బంజారాహిల్స్: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా టెంపెస్ట్ అడ్వర్టయిజింగ్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్, సాయినగర్ హైట్స్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో బేగంపేటలోని ప్రకాష్‌నగర్ సాయిసాగర్ హైట్స్‌లో నిర్వహించిన విరాళాల సేకరణతో బంజారాహిల్స్ ఈ రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. వివిధ కార్పొరేట్ సంస్థల ఉద్యోగులు, సమాజం కోసం తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్న టెంపెస్టియన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోటరీ చల్లా బ్లడ్ సెంటర్ ఆపరేషన్ హెడ్ అర్చన మాట్లాడుతూ... భారత్‌లో ప్రతి రెండు సెకన్లకు ఒక రోగికి రక్తమార్పిడి అవసరమన్నారు. అంతేకాక శస్త్ర చికిత్స, కేన్సర్ చికిత్స, బాధాకరమైన గాయాల నుంచి అవసరమైన రోగులకు రక్తదానం ఎంతో అవసరమన్నారు. రక్తం అనేది ఏ వ్యక్తికైనా ఇవ్వగలిగే అత్యంత విలువైన బహుమతిగా ఆమె అభివర్ణించారు. టెంపెస్ట్ అడ్వర్టయిజింగ్ మేనేజింగ్ డైరెక్టర్ తురబ్ లక్డావాలా మాట్లాడుతూ... యువత రక్తదాన కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్

లక్డీకాపూల్: నిమ్స్ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదాల నివారణపై సెక్యూరిటీ సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించింది. శనివారం నిమ్స్ మిలీనియం బ్లాక్ వద్ద సెక్యూరిటీ విభాగం ఏఎస్ఓ రామారావు, నిమ్స్ ఎలక్ట్రికల్ జేఈ జగదీష్‌ల ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో నివారణ చర్యలను ప్రయోగాత్మకంగా చేపట్టారు. ఈ క్రమంలో మంటలను అదుపు చేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాటించారు. నిజంగా నిమ్స్‌లో అగ్ని ప్రమాదం జరిగిందా అనే వాతావరణాన్ని కల్పించారు. సెక్యూరిటీ సిబ్బంది ప్రమాద నివారణకు పాటించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు.

పండుగలు శాంతియుతంగా చేసుకోవాలి

మూసాపేట: పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం కూకట్‌పల్లి ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్‌లో బక్రీద్ సందర్భంగా కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, అల్లాపూర్, బాచుపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలోని మసీదు కమిటీ నిర్వాహకులు, మతపెద్దలు, స్థానికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ సందర్భంగా కుర్బానీ ఇచ్చిన తర్వాత మిగిలిన వ్యర్థ పదార్థాలను రోడ్లపై పారవేయకుండా పరిసర ప్రాంత నివాసులకు ఇబ్బందులు కలగకుండా జీహెచ్ఎంసీ ఇచ్చిన ప్లాస్టిక్ కవర్లలో వేయాలని సూచించారు.

గ్రేటర్ పరిధిలోకి..

శివారు ప్రాంతాలు!

- 7 కార్పొరేషన్లు, 21 మున్సిపాలిటీలు విలీనం
- రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల అధికారులకు ఆదేశాలు జారీ



నిజాంపేట్: నగర శివారులోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను గ్రేటర్‌లో విలీనం చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగానే రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల అధికారులకు ఆదేశాలు జారీ కావడంతో అధికారులు అందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఈ ప్రక్రియ లోక్‌సభ ఎన్నికలకు ముందే ప్రారంభించారు. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో తాత్కాలికంగా విలీన ప్రక్రియను పక్కన పెట్టారు. ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ఉన్న 7 కార్పొరేషన్లు, 21 మున్సిపాలిటీలను విలీనం చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

పంచాయతీల నుంచి మున్సిపాలిటీలుగా...

గతంలో నిజాంపేట్ కార్పొరేషన్‌లోని ప్రగతినగర్, నిజాంపేట్, బాచుపల్లి గ్రామ పంచాయతీలు గ్రేటర్‌లో విలీనమయ్యాయి. కోర్టు ఆదేశాలతో తిరిగి పంచాయతీలుగానే కొనసాగాయి. అనంతరం ఈ మూడు పంచాయతీలను కలిపి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేశారు. కొంపల్లి మున్సిపాలిటీలోని కొంపల్లి, దూలపల్లి గ్రామాలతో పాటు బహదూర్‌పల్లి గ్రామాన్ని సైతం గ్రేటర్‌లో విలీనం చేసినప్పటికీ స్థానిక నాయకులు కోర్టును ఆశ్రయించడంతో తిరిగి పంచాయతీలుగానే కొనసాగించాలని కోర్టు తీర్పునిచ్చింది. పంచాయతీలుగా ఉన్న దుండిగల్, భౌరంపేట్, మల్లంపేట్, గాగిల్లాపూర్, డీపీపల్లి, బహదూర్ పల్లి గ్రామాలను కలిపి దుండిగల్ మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. – నిజాంపేట్ కార్పొరేషన్, కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీల పాలక వర్గాలు 2019లో ఎన్నికయ్యాయి. 2025 జనవరితో ఈ పాలక వర్గాల పదవీకాలం ముగియనుంది. ఏడు నెలల అనంతరం ఈ విలీన ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది.

ప్రధాన సమస్యలివే..

దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీల్లో ప్రధానంగా రోడ్ల అభివృద్ధి, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థ, దోమల నివారణ తదితర సమస్యలు ప్రధానంగా ఉన్నాయి. వీటి వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

జనాభా ఎక్కువే.. సమస్యలూ ఎక్కువే..

నిజాంపేట్ కార్పొరేషన్‌లో సుమారు రెండు లక్షలకు పైగా జనాభా ఉంది. ఇక్కడ జనాభాతో పాటు సమస్యలు కూడా అధికంగానే ఉన్నాయి. బాచుపల్లి, నిజాంపేట్, ప్రగతినగర్‌లో అంతర్గత రోడ్లు, ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. తాగునీటి సమస్య, నీటి సమస్య, దోమల బెడదతో మురికి వాడల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చెరువులు, కుంటలు, సుందరీకరణ గురించి పట్టించుకునే వారే కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులకు బిల్లుల చెల్లింపు కోసం నిధుల లేమితో ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాకాలంలో ఎక్కడపడితే అక్కడ రోడ్లపై డ్రైనేజీ పారుతోంది.

విలీనంతో అభివృద్ధిపై ఆశలు..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలు, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ విలీన ప్రక్రియతో మౌలిక సదుపాయాల కల్పనలో మెరుగైన సేవలు అందుతాయనే చర్చ ప్రజల్లో జోరుగా జరుగుతోంది.

- రెండు మున్సిపాలిటీలు, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ల అభివృద్ధిలో వేగం పుంజుకుంటుందని వివిధ పార్టీల నాయకులు చెబుతున్నారు. అదే సమయంలో అనేక మంది నాయకులకు అవకాశాలు సైతం తగ్గుతాయనే ఆందోళన కూడా ఉంది. ప్రభుత్వ నిర్ణయంపై ప్రజలు సానుకూలంగా ఉన్నప్పటికీ సమస్యల పరిష్కారం, అభివృద్ధి పూర్తి స్థాయిలో జరగాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఇక డివిజన్లుగా వార్డులు..

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 33 వార్డులు, 1,34,718 మంది ఓటర్లు ఉన్నారు. గ్రేటర్‌లో విలీనమైతే ఇక్కడ సుమారు 8 నుంచి 10 డివిజన్లు విలీనమయ్యే అవకాశం ఉంది. కొంపల్లిలో సుమారు 21 వేలకు పైగా ఓటర్లు ఉన్నారు.

- ఇక్కడ 1 నుంచి 2 డివిజన్లు విలీనమయ్యే అవకాశం ఉంది. దుండిగల్ మున్సిపాలిటీల్లో 60,445 మంది ఓటర్లు ఉండగా.. 4 డివిజన్లు అయ్యే అవకాశం ఉంది. – డివిజన్లు ఏర్పాటు చేసే సమయంలో ప్రస్తుతం గ్రేటర్‌లోని ప్రాంతాలను సైతం కలుపుకునే అవకాశాలు లేకపోలేదు.
- కుత్బుల్లాపూర్, గాజులరామారం, చందానగర్, కూకట్‌పల్లి సర్కిల్ ప్రాంతాల్లోని కాలనీలను సైతం అవసరమైన చోట డివిజన్ల ఏర్పాటులో పరిగణలోకి తీసుకునే అవకాశాలు సైతం ఉన్నాయి.

ఖబ్రస్తాన్‌ను పట్టించుకోండి !

చెట్ల కొమ్మలు, వ్యర్థాలను శుభ్రం చేయని వైనం



రామారావునగర్‌లో అపరిశుభ్రంగా ఉన్న సమాధులు ఇలా..

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వి.రామారావునగర్ కబరిస్తాన్ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుంది. ఇటీవల కురిసిన వర్షానికి నేలకొరిగిన చెట్లతో పాటు చెత్తాచెదారంతో నిండిపోయి దుర్గంధం, దుర్వాసన వెదజల్లుతోంది. ఆదివారం 16న పెద్దల పండుగ ఉన్నందున శ్మశానవాటికను శుభ్రం చేయాలని పారిశుద్ధ్యం ఆర్టికల్చర్ డీఆర్ఎఫ్ సిబ్బందికి విన్నవించినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. ఆదివారం పెద్దల పండుగ ఉన్నందున ముస్లింలు, తమ పూర్వీకుల సమాధులను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. చెత్తాచెదారం నేలకూలిన చెట్లు దర్శనమిస్తున్నాయి. పెద్దల పండుగ ఒకేరోజు ఉండటంతో ఎప్పుడు శుభ్రం చేస్తారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సర్దార్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్, పర్వత్‌నగర్‌లోని ముస్లిం శ్మశానవాటికలో కూడా విద్యుత్ దీపాలు వెలిగించడంతో వ్యర్థాలను తొలగించి శుభ్రం చేయాలని ఆయా కాలనీల్లోని ముస్లింలు సంబంధిత అధికారులను కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పెద్దల పండుగకు ఉచిత ఏర్పాటు చేయాలని పీసీసీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ వాజిద్ బాషా పేర్కొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి..

26న చలో కలెక్టరేట్



కమిషనర్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

దుండిగల్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 26న నిర్వహించే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బొడిగె లింగస్వామి అన్నారు. శనివారం గండిమైసమ్మలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలని, ప్రమాదంలో మృతిచెందిన వారికి రూ.25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇళ్లులేని వారికి డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయించాలని కోరారు. మున్సిపల్ యూనియన్ నాయకులు నరసింహ, సురేందర్, ఎల్లయ్య, నర్సింగరావు, వీరమణి, విజయ, రాణి తదితరులున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయకుండా చర్యలు

369 నుంచి 29 జీవీపీలకు తగ్గించామన్న జెడ్సీ అభిలాష అభినవ్



అధికారుల సమీక్ష సమావేశంలోజెడ్సీ అభిలాష అభినవ్ తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో అధికారులతో జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జోన్ పరిధిలోని జీవీపీలను తొలగించేందుకు అధికారుల కృషిని ప్రశంసించారు. అన్ని జీవీపీలను తొలగించేందుకు బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయకుండా స్థానిక ప్రజలకు అవగాహన కల్పించి ఆటోల్లో మాత్రమే చెత్తను వేసేలా కృషి చేశారని అధికారులను అభినందించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మొక్కలు నాటడం, క్యారమ్, చెస్ వంటి ఆటలతో పాటు 'చాయ్‌పే చర్చ' నిర్వహించారన్నారు. బస్తీ ప్రజలతో జీవీపీ ప్రాంతాల్లో సమావేశమై పార్టీ ఏర్పాటు చేశామన్నారు.

- జీహెచ్ఎంసీ పరిధిలో యోగా తరగతులు నిర్వహించాలని అధికారులను కోరారు. రామ్‌కీ ఏజెన్సీ సభ్యులు కూడా ర్యాలీల్లో పాల్గొని తమ ఇంటి వద్ద ఉన్న చెత్తను ఆటో డ్రైవర్లకు ఇవ్వాలని, రోడ్డుపై చెత్తను శుభ్రం చేసేందుకు అవగాహన కల్పించామన్నారు.
- కూకట్‌పల్లి జోన్‌లో 369 నుంచి 29 జీవిపిలను తగ్గించామని, మిగిలిన అన్ని జీవీపీలను తగ్గించేందుకు త్వరలో కృషి చేయాలని అధికారులకు సూచించారు. డిప్యూటీ కమిషనర్లు, ఎస్‌డబ్ల్యూఎం, ఏఎంఓహెచ్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్, డీపీఓ, సీఓ, ఆర్పీ, ఆర్‌డబ్ల్యూ సభ్యులు, రాంకీ ఏజెన్సీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



మధు (ఫైల్)

కుత్బుల్లాపూర్: అనారోగ్య సమస్యలకు తోడు ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి విసుగుచెంది ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్‌కు చెందిన మధు (41) మేస్త్రీ భవన నిర్మాణ కాంట్రాక్ట్ నిర్వహిస్తుంటాడు. భార్య సరోజిని, ఇద్దరు కుమార్తెలు మణి (18), రూప (17)లు ఉన్నారు. ఇటీవల అతని ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఇంట్లోని ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వినతిపత్రం అందజేత



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వివేకానంద్ యూత్ సంఘం సభ్యులు శనివారం ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం చుట్టూ రైలింగ్, ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌షెల్టర్ నిర్మాణం, భూగర్భ డ్రైనేజీ లైన్ పనులు పూర్తి చేసిన ప్రాంతాల్లో సీసీ రోడ్లు వేయాలని కోరగా.. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కమిటీ సభ్యులు లక్ష్మీనాథ్, తుమ్మ శ్రీనివాస్, నవీన్ తదితరులున్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఉప కమిషనర్ నరసింహ

కుత్బుల్లాపూర్: పారిశుద్ధ్య పనుల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునేది లేదని కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ అన్నారు. సర్కిల్ పరిధిలోని సుభాష్‌నగర్, రంగారెడ్డినగర్, జీడిమెట్ల, కుత్బుల్లాపూర్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేసి సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. కొంతమంది సిబ్బంది ఆన్‌లైన్ హాజరు వేసుకుని పని చేయకుండా వెళ్లిపోతున్నారనే విషయంపై ఆరా తీశారు. శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు అందుబాటులో ఉంటున్నారా.. లేదా అనే విషయంపై కార్మికులను అడిగి తెలుసుకున్నారు. వైద్యారోగ్య అధికారి భార్గవ్ నారాయణ సైతం పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

ఘనంగా ఫాదర్స్ డే



కుత్బుల్లాపూర్: చింతల్ వెంకటేశ్వరనగర్‌లోని బీపీఎస్ ఒలింపియాడ్ పాఠశాలలో శనివారం ఫాదర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ కోటిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ప్రీ ప్రైమరీ చిన్నారులు తమ తండ్రులపై వారికి ఉన్న ప్రేమను మాటలతో వ్యక్తం చేస్తూ.. ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ.. చిన్నారుల్లో తమ తండ్రుల పట్ల ఉన్న ప్రేమను వ్యక్త పరిచేందుకు ఫాదర్స్‌డే దోహద పడుతుందని పేర్కొన్నారు. పాఠశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ నాయకుడు కాసాని వీరేశ్‌ముదిరాజ్ అమెరికా పర్యటన ముగించుకుని నగరానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం నిజాంపేట్ కార్పొరేషన్ మైనార్టీ నాయకులు మహమ్మద్, జహంగీర్‌లు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

కల్వర్టుల్లో వ్యర్థాల తొలగింపు



జీడిమెట్ల డిపో ఎదుట కల్వర్టులో మట్టిని తొలగింపజేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్: ఎగువ ప్రాంతం నుంచి దిగువ ప్రాంతానికి వర్షపు నీరు వెళ్లేందుకు రోడ్డుపైకి చేరకుండా కల్వర్టులు ఎంతగానో దోహదం చేస్తాయి. చాలా చోట్ల కల్వర్టులు ఉన్నా.. వాటి నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో చెత్త, మట్టితో పేరుకుపోయి భూమిలో కలిసిపోయాయి.దీంతో వర్షం పడిన సమయంలో నీరు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో వరద నీరు రోడ్డుపై వచ్చి చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. జీడిమెట్ల డిపో వద్ద ప్రధానరోడ్డులో ఉన్న కల్వర్టు కొన్నేళ్ల తరబడి చెత్తతో మూడు మీటర్ల మేర కప్పేసి రోడ్డుకు సమాంతరంగా మారింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు శనివారం కల్వర్టుకు ఆనుకుని ఉన్న నాలాలో పేరుకపోయిన చెత్తను జేసీబీ సాయంతో తొలగింపజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



కూన శ్రీశైలంగౌడ్‌తో సంక్షేమ సంఘం ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శనివారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో పలు బస్తీలు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా.. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

మంత్రి భట్టి విక్రమార్కకు శుభాకాంక్షలు

ఓల్డ్ బోయిన్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదినం సందర్భంగా టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునయాదవ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని భౌరంపేట్ సెక్షన్ ఏఈ సాయికిరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఐడీఏ–2 ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బహదూర్‌పల్లి చౌరస్తా సమీపంలోని జ్యోతి మిల్స్ ఇండస్ట్రీ, హాట్సన్ ఆగ్రో కంపెనీ, హైటెక్ కంపెనీ, మయూరీ గ్రానైట్స్, డైమండ్ టూల్స్ పరిశ్రమ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

పేలుళ్లతో ఉలిక్కిపడ్డ జనం

- అనుమతులు లేకుండానే బ్లాస్టింగ్
- ఘటనా స్థలానికి రెవెన్యూ అధికారులు



పేలుడు ప్రదేశాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేణుక

సుభాష్‌నగర్: ప్రశాంతంగా ఉన్న కాలనీ ఒక్కసారిగా పేలుడు శబ్దంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. దీంతో వారు గందరగోళానికి గురయ్యారు. గాజుల రామారం డివిజన్ హెచ్ఏఎల్ కాలనీలోని సత్యనారాయణస్వామి దేవాలయం వద్ద ఓ వ్యక్తి సర్వే నంబర్ 219 పేరుతో పక్కనే ఉన్న 79 ప్రభుత్వ స్థలంలోని తన ప్లాటు ఉందని సదరు స్థలాన్ని కొన్ని రోజుల నుంచి చదును చేస్తున్నాడు. అక్కడ పెద్ద పెద్ద బండరాళ్లు అడ్డు రావడంతో వాటిని తొలగించేందుకు అనుమతులు తీసుకోకుండానే శనివారం పేలుడు పదార్థాలతో 11.45 నిమిషాలకు బ్లాస్టింగ్ చేశాడు. రాళ్లు, మట్టి పెడ్డలు 100 మీటర్ల దూరంలో ఎగిరిపడ్డాయి. దీంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. రాళ్లను పేలుస్తున్నారని గమనించి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేణుక సిబ్బందితో కలిసి ఘటనపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతలోనే సదరు వ్యక్తులు పరారయ్యారు.

పనులు చేయొద్దని చెప్పినా..

చదును చేస్తున్న స్థలం సర్వే నెంబర్ 79 ప్రభుత్వ స్థలంలోకి వస్తుందని ఇటీవల రెవెన్యూ అధికారులు పనులను నిలిపివేశారు. సదరు వ్యక్తి చాపకింద నీరుల కొండ భాగాన్ని ప్లాటుగా మార్చాడు. తాజాగా పేలుడు ఘటనతో ఇతడి కబ్జా భాగోతం బయటపడింది.

తప్పిన ప్రమాదం..

పేలుడు స్థలం పక్కనే దివ్య అనే మహిళ దుకాణానికి వెళ్లగా.. ఆమె ముగ్గురు పిల్లలు పాఠశాలకు వెళ్లారు. ఒకవేళ వాళ్లు ఇంట్లో ఉంటే ప్రమాదానికి గురయ్యే వాళ్లని స్థానికులు చెబుతున్నారు.

3వ అంతస్తుకు ఎగిరి పడ్డ రాళ్లు..



ఘటనా స్థలం పక్కనే తాము ఉన్న అపార్ట్‌మెంట్‌లో 3వ అంతస్తు వరకు చిన్నచిన్న రాళ్లు తగిలాయి. గతంలో ఇలాంటి పేలుళ్ల కారణంగా పక్కనే ఉన్న సర్వేనెంబర్ 79 లోని చెట్ల పొదల నుంచి రెండు కొండ చిలువలు మా అపార్ట్‌మెంట్‌లోకి వచ్చాయి. దీనిపై సంబంధిత అధికారులు సదరు వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– అమర్ నాథ్, స్థానికుడు